సిక్కోలులో వర్షం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం వర్షం కురిసింది. శనివారం ఉదయం ఎండ కాసినా, మధ్యాహ్నం నుంచే ఆకాశం మేఘావృతమైంది. రాత్రి 7 గంటల నుంచి పలుచోట్ల చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. మరోవైపు కళ్లాలు, పొలాల్లో ఉన్న ధాన్యం, మొక్కజొన్న, ఇతర పంటలను కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు. పరదాలు కప్పి భద్రపరిచేందుకు అవస్థలు పడుతున్నారు.

ఆమదాలవలస: రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి
- కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి విమర్శించారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, అరకొర జీతాలు చెల్లిస్తున్న కార్మికులకు సంక్షేమ పథకాలను ఇవ్వాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు నగరంలోని ఆర్అండ్‌బి బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ , రిస్క్ అలవెన్స్, చెల్లించాలన్నారు. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులకు జిపిఎఫ్ అకౌంట్లు, హెల్త్‌కార్డులు, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్, ప్రమోషన్లు కల్పించాలన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో ఈసమస్యలపై చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పట్టణాల మురుగునంతా శుభ్రం చేసి, పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. శాశ్వత స్వభావం కలిగి, ప్రమాదకరమైన విధులను నిర్వహిస్తున్న మునిసిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయకుండా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వం సొంత ఫోన్లు ఇవ్వకుండానే, చదువు లేని కార్మికులను ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ ఆధారంగా జీతాలు చెల్లిస్తామని వేధించడం తగదన్నారు. గత ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి గద్దెనెక్కాక ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కారని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ధర్నాలో ఫెడరేషన్ నాయకులు ఎ.గణేష్, ఎన్.బలరాం, టి.సంతోష్, కళ్యాణరాజు, డి.చిట్టి, జనార్ధనరావు, జె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా
- కిడ్నీ వ్యాధిపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్

ప్రజాశక్తి - కవిటి

ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకొని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, శ్రీకాకుళం కలెక్టరేట్, డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం ఆధ్వర్యాన మండలంలోని రాజపురం, బెలగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా బెలగాం పిహెచ్‌సిలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా జడ్జి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించినా ఇంకా ప్రైవేట్ ఆస్పత్రిలోనే వైద్యం చేయించుకుంటున్నారని, ఈ విషయంలో మార్పు రావాల్సి ఉందని అన్నారు. గ్రామాల్లో ఉన్న వ్యాధి తీవ్రతను బట్టి ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కిడ్నీ వ్యాధి తీవ్రతను ముందే గుర్తిస్తే మెరుగైన వైద్యంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. అతిగా నొప్పి నివారణ మందులు వాడడం, డాక్టర్లతో సంప్రదించకుండా మందుల దుకాణాల్లో మందులు కొనుక్కొని వాడటం ఆరోగ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిపై ప్రత్యేక దృష్టి సారించి, పూర్తిస్థాయిలో వ్యాధి నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కిడ్నీవ్యాధి నివారణకు కృషి చేస్తోందన్నారు. డయాలసిస్ రోగులకు గతంలో మూడు షిఫ్టుల్లో డయాలసిస్ జరిగేదని, ప్రస్తుతం వారి సౌకర్యార్థం నాలుగు షిఫ్టుల్లో డయాలసిస్ చేస్తున్నట్టు తెలిపారు. కవిటి, సోంపేట సిహెచ్‌సిల్లో డయాలసిస్ బెడ్లు పెంచేందుకు అదనపు గదులు అందుబాటులో లేకపోవడంతో కంటైనర్ల ద్వారా అదనపు బెడ్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, దీని ద్వారా మరో ఆరు చొప్పున అదనపు బెడ్లు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఉద్దానం ప్రాంతంలో ఉన్న 18 పిహెచ్‌సిలు, ఆరు సిహెచ్‌సిలో కిడ్నీ పరీక్షలు పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మాణం పలాసలో జరుగుతుందని, ఆ పనులు పూర్తయితే కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మరింత ఊరట లభిస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. డిఎంహెచ్ఒ మీనాక్షి మాట్లాడుతూకిడ్నీ వ్యాధిపై ఉన్న అపోహలు తొలగించుకోవాలని, కిడ్నీ వ్యాధి ఒక ప్రాంతానికే పరిమితమైనది కాదని, ప్రపంచ వ్యాప్తంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని అన్నారు. కిడ్నీవ్యాధి నివారణలో భాగంగా ప్రతీ ప్రభుత్వ ఆసుపత్రిలో 36 రకాల మందులను ప్రభుత్వం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో కిడ్నీ వ్యాధి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సన్యాసినాయుడు, పి.రవిశంకర్, సిఐ ఈశ్వరచంద్ర ప్రసాదరావు, ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ పైలా సూర్యనారాయణరెడ్డి, ఎస్ఐ కె.రాము, డిటి రామచంద్రరావు, డాక్టర్లు శశిధర్, రాకేష్, కవిత, సర్పంచులు మద్దిలి అన్నపూర్ణ, సనపల జానకిరావు, మద్దిలి ఈశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

21న ఆశాల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 21వ తేదీన జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి తెలిపారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సిసికి ముందస్తు నోటీసును డిఎంహెచ్ఒ కార్యాలయంలో శనివారం అందజేశారు. సమస్యల పరిష్కారానికి జిల్లాస్థాయిలో సంయుక్త సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆశాలపై పని భారాన్ని తగ్గించాలన్నారు. సంబంధం లేని పనులు చేయిస్తూ వెట్టిచాకిరీకి గురిచేస్తున్నారని చెప్పారు. అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు ఆశా వర్కర్ల నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. విలేజ్ హెల్త్ క్లినిక్ , సచివాలయ విధుల నుంచి ఆశా వర్కర్లకు మినహాయించాలన్నారు. ఆశా వర్కర్లకు సెలవులు మంజూరు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాగమణి, ఆశావర్కర్లు

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి
- వైద్యుల సెలవుపై ఆరా

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి టెక్కలి జిల్లా ఆస్పత్రి వైద్యులు, సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక జిల్లా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఒపి విభాగాలను పరిశీలించి, పలువురు రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలోని పలు ఐపి విభాగాలతో పాటు క్యాజువాలిటీ, ఫార్మసీ, తదితర ముఖ్య విభాగాలను పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమీక్షించారు. జిల్లా ఆస్పత్రికి ప్రతి రోజూ వస్తున్న రోగులకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒపి విభాగం పరిశీలనలో భాగంగా గైనిక్, జనరల్ మెడిసన్ వైద్యులు సెలవులో ఉండటంపై సబ్ కలెక్టర్ ఆరాతీశారు. సెలవులో ఉన్న వైద్యుల వివరాలు, కారణాల నివేదికను ఇవ్వాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావును కోరారు. అనంతరం పలువురు రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న సేవలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఆర్ఎం. డాక్టర్ శ్రీరాములు, వైద్యులు కణితి కేశవరావు, అన్నెపు వినోద్‌కుమార్, తేజ్ ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

ఆస్పత్రిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టీచర్ కొట్టిన ఘటనపై విచారణ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

విద్యార్థినిని టీచర్ చితకబాదిన ఘటనపై ఎంఇఒ అప్పారావు, చైల్డ్‌లైన్ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. పరీక్షలో విద్యార్థినికి మార్కులు తక్కువ వచ్చాయని మండలంలోని బొడ్డకలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినిని ఉపాధ్యాయురాలు లలిత చితకబాదిన విషయం తెలిసిందే. ఈ ఘటనను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సుమోటోగా స్వీకరించిందని సభ్యులు గొండు సీతారాం తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్, డిఇఒ, ఎంఇఒ విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తదుపరి కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు చర్యలు ఉంటాయని సీతారాం అన్నారు. ఎంఇఒ అప్పారావు, చైల్డ్‌లైన్ అధికారి జాస్మిన్ కుమారి శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. విద్యార్థినిని చితకబాదిన టీచర్ లలితను వివరణ కోరారు.. అనంతరం హెచ్ఎం, విద్యార్థినిని తల్లిదండ్రులతో మాట్లాడారు. వారి స్టేట్‌మెంట్‌ను రికార్డుచేసుకున్న అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని, అక్కడ నుంచి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు వెళ్తుందని ఎంఇఒ చెప్పారు.

పాఠశాలలో విచారణ చేస్తున్న ఎంఇఒ, చైల్డ్‌లైన్ అధికారి

మహా ధర్నాను అడ్డుకునే చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో నిర్వహించే మహా ధర్నాకు అంగన్వాడీలను వెళ్లకుండా నోటీసులు ఇచ్చి, అడ్డుకోవడాన్ని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి తీవ్రంగా ఖండించారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్వాడీలకు తెలంగాణ ప్రభుత్వం కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన మహా ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు వెళ్లవద్దని నోటీసులు ఇస్తూ, పోలీస్ స్టేషన్‌కు రావాలని ఫోన్లు చేస్తూ అంగన్వాడీలను ప్రభుత్వం భయపెట్టి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. పలాస, మందస, శ్రీకాకుళం, ఆమదాలవలస, రణస్థలం, తదితర ప్రాజెక్టుల్లో అంగన్వాడీలకు పోలీసులు ముందస్తుగా 149 సిఆర్‌పిసి నోటీసులు జారీ చేస్తున్నారని అన్నారు. మహా ధర్నాను అడ్డుకునే చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కన్నా రూ.వెయ్యి వేతనం పెంచుతామని జగన్ ఇచ్చిన హామీ నీటిమీద రాతలయ్యాయని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పుఇచ్చినా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో అంగన్వాడీలకు వేతనం పెంపులేదని, 2017 నుండి టిఎ బిల్లులు చెల్లించడంలేదని తెలిపారు. ఈ సమస్యలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ర్యాలీలు, సభలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న తేజేశ్వరరావు

760 మంది గైర్హాజరు

శ్రీకాకుళం అర్బన్: ఇంటర్ ద్వితీయ ఏడాది పరీక్షలకు శనివారం 760 మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 109 పరీక్షా కేంద్రాల్లో 26,139 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 760 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 24,289 మందికి 663 మంది గైర్హాజరయ్యారు. 23,626 మంది హాజరయ్యారు. 1850 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 97 మంది గైర్హాజరయ్యారు. 1753 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

ఫోన్‌కు సెక్యూరిటీ లాక్ తప్పనిసరి

- లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా 150 ఫోన్లు రికవరీ
- ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మొబైల్ ఫోన్‌లో సెక్యూరిటీ లాకింగ్ లేకుండా ఎటువంటి విలువైన వ్యక్తిగత సమాచారాన్ని ఉంచరాదని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. సుమారు రూ.20 లక్షల విలువ గల 150 మొబైల్ ఫోన్లను జిల్లా పోలీస్ శాఖ వెబ్‌సైట్ లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా గుర్తించి, రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి శనివారం అందజేశారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో మొబైల్స్‌ను పోగొట్టుకున్న బాధితులు పోలీస్‌స్టేషన్లకు వెళ్లే పని లేకుండా జిల్లా ఐటి కోర్ టీమ్ రూపకల్పన చేసిన http://srikakulam police.in/mobiletrack-upload.html వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయడంతో జిల్లా సైబర్ సెల్ సిబ్బంది 150 ఫోన్లను గుర్తించి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రెడిట్ కార్డు, ఎటిఎం పిన్ నంబర్లు, నెట్ బ్యాంకింగ్ తదితర వాటికి భద్రతాపరమైన లాకింగ్ తప్పకుండా వేసుకోవాలన్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు కొంతమంది తక్కువ ధరలకు ఇతరులకు అమ్ముతున్నారని చెప్పారు. ఇలా మన జిల్లా, రాష్ట్రం, దేశంలోనే కాకుండా విదేశాల్లో ఉన్న ఫోన్లనూ రికవరీ చేసినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లు పోతే తక్షణమే జిల్లా మొబైల్ లాస్ట్ ట్రాకింగ్ సిస్టమ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు రూ.32.5 లక్షల విలువగల మొత్తం 280 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. సరైన పత్రాలు లేకుండా ఎవరూ మొబైల్స్ కొనవద్దని సూచించారు. ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన సైబర్ సెల్ సిబ్బందిను ఎస్‌పి అభినందించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, ఎస్ఐ ప్రసాదరావు, ఎఎస్ఐ బి.రమేష్, సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

రికవరీ చేసిన సెల్‌ఫోన్లు చూపిస్తున్న ఎస్‌పి రాధిక

నేడు జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల

ప్రజాశక్తి -శ్రీకాకుళం

జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో డిబిటి విధానం ద్వారా సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆదివారం నగదు జమ చేయనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. శనివారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 53,867 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో విద్యను అభ్యసిస్తుండగా 48,345 తల్లుల ఖాతాల్లో రూ.31.40 కోట్లు 2022-23 విద్యా సంవత్సరానికి మొదటి విడతగా నగదును జమచేయనున్నట్లు వివరించారు.

చేజేతులా ...

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపికి శాసనమండలి ఎన్నికలు పూర్తిస్థాయిలో కలిసిరాలేదు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఆ పార్టీపై ఉన్న ఆగ్రహంతో కొన్ని ఓట్లు చేజారాయి. స్థానిక సంస్థల్లో క్రాస్ ఓటింగ్ విషయంలో ప్రభుత్వంతో పాటు పార్టీ జిల్లా పెద్దలు బాధ్యత వహించక తప్పదు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందన్న ఆగ్రహం సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిల్లోనూ అంతర్లీనంగా ఉంది. పంచాయతీలకు రావాల్సిన నిధులను మళ్లించడంతో ఒక్క అభివృద్ధి పనీ చేయలేకపోయామనే ఆవేదన ఎన్నికైన ఏడాది తర్వాత నుంచి మొదలైంది. ఉపాధి హామీ నిధులతో చేసిన పనులకు నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో ప్రజాప్రతినిధులకు విసుగెత్తింది. ప్రభుత్వంపై ఉన్న ఈ ఆగ్రహమే స్వతంత్ర అభ్యర్థి ఆనెపు రామకృష్ణకు అదనంగా ఓటు దక్కేలా చేశాయి. స్వతంత్ర అభ్యర్థికి టిడిపి నేపథ్యం ఉన్నా ఆ పార్టీ నుంచి రావాల్సినన్ని ఓట్లు రాకపోగా, వైసిపి నుంచి 70కి పైగా ఓట్లు వచ్చాయంటే అది ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతగానే చూడాలి

మరోవైపు పార్టీ పెద్దల వైఖరీ వైసిపిలో అసంతృప్తికి దారితీసింది. అధికార పార్టీకి చెందిన ఓ కీలక నేత ఆడిన పొలిటికల్ గేమ్‌తో కాపు సామాజిక తరగతి ప్రతినిధుల ఆగ్రహానికి కారణమైంది. ఆ తరగతికి చెందిన నాయకులకు ఎమ్మెల్సీ సీటు ఇస్తే రాజకీయంగా తన ఆధిపత్యానికి కొంత ఇబ్బంది వస్తుందనే ఉద్దేశంతో యాదవ సామాజిక తరగతికి చెందిన నర్తు రామారావుకు సీటు ఇప్పించడంలో పావులు కదిపారన్న చర్చ కాపు సామాజిక తరగతిలో సాగుతోంది. వైసిపి నేతపై ఉన్న కోపంతోనే టిడిపికి చెందిన కాపు సామాజిక తరగతి నాయకుడు ఆనెపు రామకృష్ణకు వైసిపి ప్రజాప్రతినిధులు కొందరు అనుకూలంగా ఓటేశారన్నది ఇప్పుడు ఆ పార్టీలో చర్చ సాగుతోంది

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి టిడిపి గెలుపు కంటే వైసిపి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతే స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలపై కరెంట్ ఛార్జీలు, ఇంటి పన్ను, చెత్త పన్నుతో పాటు పలురూపాల్లో పన్నుల భారం మోపడంపై జనంలో తీవ్ర ఆగ్రహం నెలకొంది. ప్రత్యేకించి ఏటా జాబ్ కేలండర్ ప్రకటిస్తామని యువతకు ఇచ్చిన హామీని వైసిపి ప్రభుత్వం విస్మరించింది. సిపిఎస్ రద్దు, ఉద్యమాల అణచివేత వైఖరిపై ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లోనూ పట్టరాని ఆగ్రహం ఉంది. వైసిపి ప్రభుత్వంపై తీవ్ర కసే వేపాడ చిరంజీవిరావు గెలుపునకు కారణమైంది. పట్టభద్రులకు కేటాయించిన స్థానంలో టిడిపిని గెలిపించడం ద్వారా పట్టభద్రులు తమ ఉనికిని కోల్పోయినట్లయింది. తమకేం కావాలో, ప్రభుత్వం ఇచ్చిన హామీలేమిటో ప్రశ్నించే అవకాశాన్ని పట్టభద్రులు వదులుకున్నట్లయింది. టిడిపి, వైసిపిల నుంచి ఎవరు గెలిచినా ఆ పార్టీ అజెండాకు అనుగుణంగా పనిచేస్తారే తప్ప ఆయా సమస్యలపై స్వతంత్రంగా మాట్లాడే స్వేచ్ఛ వారికి ఉండదనేది చట్టసభల్లో చర్చల సందర్భంగా చూస్తున్నాం. రాజకీయ పార్టీలు ఏ నిర్ణయం తీసుకుంటే వాటి నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు విధిగా అనుసరించాల్సిందే. స్వతంత్ర అభ్యర్థికి ఆ పరిస్థితి ఉండదు. ఏ అంశంపైనైనా స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం ఉంది. 2014 సాధారణ ఎన్నికల సందర్భంగా సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన టిడిపి ఐదేళ్లలో ఆ పని చేయలేకపోయింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని వైసిపి హామీ ఇచ్చింది. రెండు పార్టీలు ఆ అంశంపై నాలుక మడత పెట్టేసిన నేపథ్యంలో స్వతంత్రంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు గొంతెత్తగలరు. ఏటా జాబ్ కేలండర్ ప్రకటిస్తామని హామీనిచ్చిన ప్రభుత్వం ఆ విషయమే మరిచిపోయింది. దానిపై టిడిపి ప్రశ్నించనూ లేదు. విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం విశాఖకు రైల్వేజోన్ ఇవ్వకపోగా, త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెడుతున్నా టిడిపి, వైసిపిలు పోటీ పడి బిజెపికి మద్దతు పలుకుతున్నాయి. ఇటువంటి తరుణంలో పోరాడే గొంతుకగా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థిని మండలికి పంపాల్సిన అవకాశాన్ని పట్టభద్రులు చేజేతులా వదులుకున్నారు. మరోవైపు స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా వైసిపి నుంచి ఎన్నికైన నర్తు రామారావు కూడా పార్టీ ఏం చేప్తే అది చేస్తారు తప్ప స్వతంత్రంగా వ్యవహరించే వీల్లేదు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు జిల్లాస్థాయిలో ఏకైక వేదికగా ఉన్న జిల్లా పరిషత్ సమావేశాల్లో తమకు నిధులు ఇవ్వకుండా ఈ పదవులు ఎందుకంటూ వారు పలుమార్లు గొంతెత్తిన సందర్భాలు చూశాం. వారి ఆవేదన అరణ్య రోదనగానే మిగిలిపోయింది. స్థానిక సంస్థల నుంచి ఎన్నికైన వారే నేరుగా శాసనమండలికి ఎన్నికైతే కొంతవరకైనా ఆ ప్రతినిధులకు మేలు చేకూరుతుంది.

వేసవిలో ముందు జాగ్రత్తలు అవసరం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో రానున్న వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బ బారినపడి ఏ ఒక్కరూ ప్రాణాల మీదికి తెచ్చుకోకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. జెసి నవీన్ అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు నెలల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, దీనిపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఎంపిడిఒల ఆధ్వర్యాన అన్ని మండలాల్లో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జెడ్‌పి సిఇఒ వెంకటరామన్‌ను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ఎఎన్ఎంలతో సమన్వయంతో పని చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు చోట మరిన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. షెడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు తగినన్ని ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డ్వామా అధికారులను ఆదేశించారు. పని వేళల్లో మార్పులు పరిశీలించాలన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యాన వడదెబ్బపై సిడిపిఒ, సైపర్‌వైజర్లు, అంగన్వాడీలు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వన్యప్రాణులకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా అక్కడక్కడా నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 104, 108 మొబైల్ మెడికల్ వాహనాల సేవలను వేసవిలో విస్తృతం చేయాలన్నారు.

వడదెబ్బ, అతిసార వంటి సమస్యలపై వైద్య ఆరోగ్య సిబ్బంది, అధికారులు వెంటనే స్పందిస్తూ తక్షణ సేవలు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నిశాకుమారి, జెడ్‌పి సిఇఒ వెంకటరామన్, నగరపాలక సంస్థ కమిషనర్ ఒబులేసు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, డ్వామా పీడీ చిట్టిరాజు, బాలమాన్ సింగ్, వ్యవసాయ, డిఆర్‌డిఎ, ఫైర్, పోలీసు అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి గుణపాఠం

ప్రజాశక్తి - రణస్థలం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు అరాచక వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పారని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకట్రావు విమర్శించారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజల తీర్పు ప్రజాస్వామ్యానికి మలుపుగా అభివర్ణించారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలనూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. సంక్షేమ పథకాల పేరు చెప్పి భారాలను మోపిందన్నారు. రాష్ట్రాభివృద్ధిని వదిలి రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. చివరకు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ధ్వజమెత్తారు. మేధావులు మౌనం వహిస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదమన్నారు. ఈ ఎన్నికల్లో పట్టభద్రులైన మేధావులు తమ ఓటు హక్కుతో తమ నిర్ణయాన్ని స్పష్టం చేశారని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును సిఎం చేసేందుకు టిడిపి శ్రేణులు కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు లంక శ్యామలరావు, డిజిఎం ఆనందరావు, జగన్నాథం, లక్షణరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కళావెంకటరావు

మండల ప్రజా పరిషత్ - కోటబొమ్మాళి

రేఖా సంఖ్య నెం.49/2020/ఏ. **బహిరంగ వేలం ప్రకటన** తే.14.03.2023 ది.

రాజపత్రం క్రమ సంఖ్య : 98,తే.10.02.2023 ది

వేలం వేసే ఆఫీసర్ పేరు : కోటబొమ్మాళి మండల పరిషత్ అభివృద్ధి అధికారి లేక వారి అధికారము పొందిన ఆఫీసరు
వేలం జరుపు స్థలం : కోటబొమ్మాళి / మండల ప్రజా పరిషత్తు కార్యాలయము
సమయం / తేది : **తే.21.03.2023 ది, మంగళవారం ఉదయం గం.11.00 లకు,** 2023 - 24 ఆర్థిక సంవత్సరము నందు **తేది 01-04-2023 నుండి తేది 31-03-2024 వరకు** నారాయణవలస వారపు సంతలో ఆశీలు వసూలు చేసుకొనే హక్కులను బహిరంగ వేలం వేయుటకు పత్రికా ప్రకటన చేయడమైనది.

షెడ్యూలు

వరుస సంఖ్య	వేలం వేయబడు స్థలం	హద్దులు	సుమారు విస్తీర్ణం	ధరావత్తు పైకం
1.	నారాయణవలస గురువారం సంతలో 2022-23 ఆర్థిక సం॥నకు ఆశీలు వసూలు చేసుకునే హక్కు	ఉ॥ సర్వే నెం.	171-బి ఎ5-24	రూ.5,00,000 (అయిదు లక్షలు)
		ద॥ సర్వే నెం.	16-ఎ	
		తూ॥ సర్వే నెం.	321-1-03	
		ప॥ సర్వే నెం.	173-274-111ఎ	

షరతులు : **1.**నారాయణవలస సంత పాటదారులు షెడ్యూల్ ధర మొత్తం రూ.2500/-లు మరియు డిపాజిట్లు మొత్తం రూ.5,00,000/-లు, యస్.బి.ఐ, కోటబొమ్మాళిలో చెల్లుబాటు అయ్యే విధంగా మండల పరిషత్తు సాధారణ నిధులకు చలానా ద్వారా గాని, మండల పరిషత్తు అధికారి పేర బ్యాంకు Draft ద్వారా గాని చెల్లించవలెను. **2.**హెచ్చుపాటదారులు ఖాయపరచిన గుత్తమొత్తములో సగభాగము తక్షణమే ఈ కార్యాలయమునకు చెల్లించి గుత్తహక్కును పొందవలయును. తదుపరి సగభాగమునకు కౌలుదారులు తన స్వంత చెక్కులను యం.పి.డి.ఓ, కోటబొమ్మాళి వారి పేరున సమర్పించవలసి యుండును. **3.**వేలం పాట జరిపిన మండల పరిషత్తు అభివృద్ధి అధికారి, కోటబొమ్మాళి వారిచే విదించబడిన యితర షరతులకు లోబడి పాటదారులు పాటలో పాల్గొనవలెను. మరియు పాటలో హెచ్చు పాటదారులు సదరు షరతులు అన్నింటిని ఒప్పుకున్నట్లు రూ.300/-లు నాన్ జుడీషియల్ స్టాంపుపై అంగీకార పత్రము ఈ కార్యాలయమునకు సమర్పించవలసియుండును. **4.**వేలం పాటలో పాల్గొన్న పాటదారులు రూ.5,00,000/-లకు మించిన విలువ కలిగిన రెవిన్యూ డిపార్ట్మెంటు వారిచే జారీ కాబడిన ధృవపత్రముతో హాజరుకావలసియుండును. **5.**పాట ఖాయపరచిన తదుపరి వేలంపాటదారులు తనకు రూ.5,00,000/-లకు మించిన విలువ కలిగిన రెవిన్యూ డిపార్ట్మెంటు వారిచే జారీ కాబడిన ధృవపత్రములు కలిగిన ఇద్దరు పూచీదారులచే వ్రత పూర్వకమైన హామీని కార్యాలయమునకు సమర్పించిన తదుపరి పాటదారుని పేరును ఖరారుపర్చబడును.

సం/- మండల పరిషత్తు అభివృద్ధి అధికారి, మండల ప్రజా పరిషత్, కోటబొమ్మాళి.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బెలగాం సచివాలయాన్ని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ శనివారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి, సిబ్బంది పనితీరు తెలుసుకున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సచివాలయం పరిధిలో ఉన్న చెత్తని చూసి పంచాయతీ కార్యదర్శిని మందలించారు. సచివాలయంలో పరిస్థితే ఇలా ఉంటే పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని, పక్కాగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం కవిటి సిహెచ్‌సిని సందర్శించారు. వైద్యులతో మాట్లాడి డయాలసిస్ యూనిట్ పనితీరు, కొత్తగా మంజూరు చేసిన కంటైనర్ వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, డిటి రామచంద్రరావు, ఆర్ఐ రమణమూర్తి, డాక్టర్ రాంజీ, రెవెన్యూ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాగమణి, మహాలక్ష్మి

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న విజయవాడలో మహాధర్నాను చేపడుతున్నామని, వంట కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.నాగమణి, ప్రధాన కార్యదర్శి అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో మహాధర్నా పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించే లక్ష్యంతో వంట కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యాలకు విరుద్ధంగా నీరుగారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో వంట షెడ్లు నిర్మించాలన్నారు. వంట పాత్రలు, గ్యాస్ సరఫరా చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రైమరీ విద్యార్థులకు రూ.5.88 పైసలు, అప్పర్ ప్రైమరీ/ హైస్కూల్ విద్యార్థులకు రూ.8.57 పైసలతో నాణ్యమైనటువంటి పౌష్టికరమైన భోజనం పెట్టడం సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు. వంట కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని, ప్రతినెలా 5వ తేదీలోగా వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సుశీల, ఎ.కళావతి, టి.రామానుజమ్మ, వి.లక్ష్మి, ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన బస్సు

పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు
త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- పోలాకి

40 మంది చిన్నారులతో ప్రయాణిస్తున్న ఓ ప్రయివేటు స్కూల్ బస్సు అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... నరసన్నపేట సెయింట్ క్లారిటీ స్కూల్ బస్సు పిన్నింటిపేట నుంచి 40 మంది చిన్నారులతో వెళ్తుంది. మార్గమధ్యంలో ప్రియాగ్రహారం వద్ద బస్సు అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. అయితే బస్సులో ఉన్న చిన్నారులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న స్కూల్ యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బస్సు ఫిట్నెస్ లేకపోవడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని చిన్నారుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఏమిటని కోపోద్రిక్తులై బస్సు అద్దాలు పగలకొట్టారు. సంఘటన స్థలానికి ఎస్ఐ నరసింహమూర్తి చేరుకుని డ్రైవర్ కోటేశ్వరరావు మాట్లాడి కేసు నమోదు చేశారు. చిన్న చిన్నగా గాయపడిన 12 మందిని స్కూల్ యాజమాన్యం వేరే బస్సులో నరసన్నపేట ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి ఇంటికి పంపించారు. ప్రియాగ్రహారం వద్ద ఎదురుగా ఆటో వెళ్తుందని, దానిని ఢీకొంటే ప్రమాద సంభవిస్తుందని భావించి పొలంలోకి బస్సును మళ్లించానని డ్రైవర్ కోటేశ్వరరావు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు స్కూల్‌కు వెళ్లి చిన్నారులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పోలాకి: మండలంలో దీర్ఘాశి సమీపంలో శనివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన శిర్ల తంబయ్య (68) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... సాయంత్రం కింజరాపువానిపేట నుంచి తన స్వగ్రామం సైకిల్‌పై వెళ్తుండగా... మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలో పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలకున్నాయి.

మాట్లాడుతున్న సుబ్బారావు

సహకార సంఘాలకు ఆడిట్ తప్పనిసరి
జిల్లా సహకార అధికారి సుబ్బారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సహకార సంఘాల ఆడిట్ నిర్వహణకు అధికారులు చొరవ చూపాలని జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.సుబ్బారావు సూచించారు. నగరంలోని మహాలక్ష్మినగర్ కాలనీలోని సహకార కమ్యూనిటీ హాలులో శనివారం సహకార శాఖ అధికారులకు స్వల్పకాలిక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సహకార సంఘాల అభివృద్ధికి అధికారులు సహకరించాలన్నారు. క్రమం తప్పకుండా ఆడిటింగ్ జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా సహకర ఆడిట్ అధికారి బి.నగేష్ మాట్లాడుతూ సహకార సంఘాల ఆడిట్ నిర్వహణలో సహకారశాఖ అధికారులు కీలకపాత్ర వహించాలన్నారు. సమావేశంలో రాజమండ్రి రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, డివిజనల్ సహకార అధికారి కె.దామోదర్, సబ్ డివిజనల్ సహకార అధికారి ఎన్.భూషణరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూజారి జానకీరాం, సహకారశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి బొడ్డేపల్లిపేట ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగిస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పాతినివారి వీధి, కొత్తకోటవారి వీధి సగభాగం, మోణింగి వారి వీధి, డాబాల వారి వీధి, పాల పోలమ్మ ఆలయం, కామేశ్వరి కళ్యాణ మండపం, పోలీస్ స్టేషన్, కోటి సెంటర్, కోర్టు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పర్యాటక క్లబ్‌లతో విస్తృత ప్రచారం

జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించి తద్వారా జిల్లాను పర్యాటక ప్రాభవాన్ని తీసుకొచ్చేందుకు యువ పర్యాటక క్లబ్‌లు దోహదపడతాయని జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు అన్నారు. నగరంలోని న్యూ సెంట్రల్ స్కూల్ లో యువ టూరిజం క్లబ్‌ను శనివారం ప్రారంభించారు. జిల్లాలో అనేక విద్యా సంస్థలు యువ క్లబ్‌లు ఏర్పాటుకు ముందుకొస్తున్నాయని అన్నారు. ఇందుకు సహకరించిన న్యూ సెంట్రల్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మన సంస్కృతి వారసత్వ సంపద పరిరక్షించానికి పర్యాటక ప్రదేశాల అభివృద్ధి చెందాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ బి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ యువ క్లబ్‌ల నిర్వహణలో జిల్లా యువజన సర్వీసుల శాఖ సహరిస్తుందన్నారు. విద్యార్థుల్లో భావ ప్రకటనా సామర్థ్యాలు పెరిగితే భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలు సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌టాక్ పూర్వ కన్వీనర్ కె.వి.జె రాధాప్రసాద్ పాల్గొన్నారు.

యువ క్లబ్‌ను ప్రారంభిస్తున్న నారాయణరావు

మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు

మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి- నందిగాం

నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి హామీనిచ్చారు. నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఎస్.చలమయ్య అధ్యక్షతన అభివద్ధి కమిటీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిహెచ్‌సిలో అదనపు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. వైద్యశాఖ సిబ్బంది రోగులకు మెరుగైన సేవలు అందజేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.58 లక్షలతో చేపడుతున్న ఆస్పత్రి మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ పనుల్లోని మిగులు నిధులతో ఆస్పత్రి వద్ద అదనపు భవన సదుపాయం కల్పించాలని ఆర్అండ్‌బి డిఇకి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఆస్పత్రిలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ భాగ్యలక్ష్మి, నందిగాం సర్పంచ్ ప్రతినిధి జడ్యాడ జయరాం, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు తెలుగు కథల పోటీ

ఇచ్ఛాపురం: ఉగాదిని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు తెలుగు భాషపై ఆసక్తి కల్పించేందుకు తెలుగు కథల పోటీ నిర్వహిస్తున్నట్లు సీనియర్ న్యాయవాది ఎన్.విశ్వనాథ్ తెలిపారు. స్థానిక జ్ఞానభారతి విద్యా సంస్థలో ఈనెల 20న మధ్యాహ్నం 3గంటల నుండి కథల పోటీ ఉంటుందన్నారు. 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు చెందిన విద్యార్థులు ఈ పోటిలో పాల్గొనేందుకు అర్హులని అన్నారు. పరవస్తు చిన్నయసూరి, మిత్ర భేదం, మిత్ర లాభం తెలుగు కథల పోటీ ఉంటుందన్నారు. ఇందులో నుండి ఒక కథను తెలుగు గ్రాంథికం లేదా వాడుక భాషలో రాయవచ్చని చెప్పారు. ఈ కథల పోటీలో గెలుపొందిన విజేతలకు ఉగాది సందర్భంగా 22న బహుమతులు అందజేస్తామన్నారు.

చంద్రశేఖరరెడ్డిని సన్మానిస్తున్న నాగేశ్వరరావు, తదితరులు

'ఐతమ్' అధ్యాపకులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులకు శనివారం ఫ్రేమ్ వర్క్ ఫర్ రీసెర్చ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్ అండ్ ర్యాంకింగ్ క్రెడిటోరియం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పరిశోధనలు, వాటి ప్రయోజనాలు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు గల అవకాశాలను రీసోర్స్ పర్సన్, జెఎన్‌టియు ప్రొఫెసర్ ఎస్.చంద్రశేఖరరెడ్డి వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.వి నాగేశ్వరరావు మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక అవసరాలు, పరిశ్రమలకు కావాల్సిన పరిశోధనల ప్రాధాన్యతను అధ్యాపకులకు వివరించారు. అనంతరం చంద్రశేఖరరెడ్డిని సన్మానించారు. సదస్సులో డాక్టర్ దుప్పల ఆజాద్, డాక్టర్ కె.బి మధుసాహు, పలు విభాగాల డీన్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మద్యం పట్టివేత

కొత్తూరు : కొత్తూరు నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఎం.గోవింద్ తెలిపారు. స్థానిక భవానీ అమ్మవారి ఆలయం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా... నివగాంకు చెందిన బి.సుందర నారాయణ పది, సిరుసువాడకు చెందిన మల్లా ఫాల్గుణరావు 34 34 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి పాతపట్నం సబ్ జైలుకు తరలించామని తెలిపారు.

గృహోపకరణాలు దగ్ధం

టెక్కలి రూరల్: టెక్కలి మేజరు పంచాయతీ ఆంజనేయపురం గ్రామానికి చెందిన ముడిదాన జంగమయ్య నివాసంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు, వస్త్రాలతో పాటు, బీరువా, నిత్యావసర సరుకులు దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వచ్చి, దట్టంగా పొగ రావడంతో స్థానికులు మంటలను అదుపు చేశారు. ఇంట్లో విలువైన సామాగ్రి కాలిపోవడంతో జంగమయ్య రోదించాడు. ఘటనా స్థలాన్ని టెక్కలి ఎంపిపి ప్రతినిధి అట్ల రాహుల్‌తో పాటు వార్డు సభ్యులు లోకేష్ పరిశీలించారు. భాదితుడిని పరామర్శించారు. ఈ విషయమై తమకు ఎటువంటి సమాచారం లేదని టెక్కలి అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

31లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లింపుదారులు ఈ నెల 31వ తేదీలోపు పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజగోపాల్ తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం పన్నులపై విధించిన వడ్డీని ఒన్‌టైమ్ మేజర్‌గా మాఫీ చేయడం జరుగుతుందని అన్నారు. పన్ను చెల్లింపుదారులు బకాయిలు ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మినాయింపు ఉంటుందని చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలోని వసూలు చెల్లింపు కౌంటర్‌లో గానీ, వార్డు సచివాలయంలో కూడా చెల్లించవచ్చని అన్నారు. లేకుంటే ఆన్‌లైన్‌లో నెట్‌బ్యాంక్ ద్వారా, డెబిట్ కార్డుల ద్వారా, యుపిఐ ద్వారా కూడా చెల్లించవచ్చని తెలిపారు.

ఎంపిటిసికి పరామర్శ

సంతబొమ్మాళి : మండలంలోని లక్కివలస ఎంపిటిసి చింతల రాజులు తల్లి తవిటమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పిఎసిఎస్ ఛైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు శనివారం పరామర్శించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి నక్క భీమారావు, లింగూడు సర్పంచ్ తై.నారాయణ, జి.ఈశ్వరరావు, జి.కుమార్, బి.సీతారాం, ఎం.పాపారావు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిన్న నాయకులు

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

కేసులను పరిష్కరిస్తున్న జడ్జి హరిప్రియ

ప్రజాశక్తి కోటబొమ్మాళి

లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులు సత్వరంగా పరిష్కరించుకోవాలని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సి.హరిప్రియ అన్నారు. శనివారం స్థానిక కోర్టు అవరణంలో జరిగిన ప్రత్యేక లోక్ అదాలత్, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసమే చట్టాలున్నాయని, అందుకే ప్రతి ఒక్కరూ వాటిపై అవగాహన పెంపొందించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా 6 కేసులను పరిష్కరించామని, అందులో మూడు సివిల్, రెండు మనోవర్తి, ఒక్క క్రిమినల్ కేసు పరిష్కరించబడ్డాయని తెలిపారు. సదస్సులో లోక్‌అదాలత్ సభ్యులుగా డి.నరసింహమూర్తి, బి.నారాయణరావు న్యాయవాదులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.కృష్ణమూర్తి, వెలమల అప్పలనాయుడు, పి.అర్జునరావు, ఆర్.కృష్ణంనాయుడు, పల్లి వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై సూచిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎలయన్స్ క్లబ్ అధ్వర్యంలో జాతీయ రహదారి ధనరాజు తులసమ్మ ఆలయం సమీపంలో సూచిక బోర్డును సిఐ ఈశ్వరచంద్ర ప్రసాద్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రయాణికులు సూచిక బోర్డు లేకపోవడంతో ఎటువెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సూచిక బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎస్ఐ కె.గోవిందరావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ తిప్పన లక్ష్మణరెడ్డి, పిఆర్ఒ దక్కత గోపీనాథ్‌రెడ్డి, సభ్యులు ఉమాశంకర్, యోగి, సిహెచ్ రమణ, ఎల్.వెంకటరావు, చంద్రశేఖర్‌రెడ్డి, భీష్మ, బాలా, వెంకటరమణ, ఎల్ఐసి బుజ్జి, వాసు, బాలకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ టి.రామారావు పాల్గొన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

భూ రీ సర్వే వేగవంతం

బూర్జ : మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో నూ భూముల రీ సర్వేను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సర్వే ఆఫ్ ఇండియా టీం ప్రతినిధి శ్రీహరి తెలిపారు. మండలంలోని మద్రిపాడుపంచాయతీలో మద్రిపాడు, కొత్తవలస, హరిపురం, పల్లాపురం, బొడ్లపాడు గ్రామాల్లోని భూముల్లో శనివారం రీ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 64 రెవెన్యూ గ్రామాలకు 32 గ్రామాల్లో భూ రీ సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన 32 రెవెన్యూ గ్రామాల్లోని భూముల్లో రీ సర్వే వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను తీసివేశామన్నారు. ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా సరిచేసుకోవాలన్నారు. మండల సర్వేయర్ గణపతి, శ్రీకాకుళం ఎడి కార్యాలయం బెహరా చిరంజీవి, గ్రామ సర్వేలు జ్ఞానేనంద, బాలకృష్ణ, భాస్కరరావు, విఆర్ఒ రమణమ్మ పాల్గొన్నారు.

దళితుల వీధి రోడ్డు మూసేయడం అన్యాయం

ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : ఇచ్ఛాపురం మండలం మశాకపురంలో దళితులైన దండాశి కులస్తుల వీధికి రహదారి లేకుండా మధ్య మండపాన్ని నిర్మించడం అమానుషమని, తక్షణమే ఆ కట్టడాన్ని తొలగించాలని దళిత సంఘాల నాయకులు మిస్కా కృష్ణయ్య డిమాండ్ చేశారు. నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరం వద్ద జెఎసి ఆధ్వర్యాన శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ దళితులను వీధిలోకి రానీయకుండా రోడ్డు మధ్యలో మండపాన్ని నిర్మించడం ఏమిటని ప్రశ్నించారు. దీనికి తోడు ఆ ప్రదేశంలోని తాగునీటి బోరును తొలగించడం వల్ల నీటికి ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురి చేస్తున్న గ్రామ పెద్దలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బెలమర ప్రభాకర్, రాకోటి రాంబాబు, నల్లబారికి గురుమూర్తి, దళిత సంఘాల జెఎసి జిల్లా కన్వీనర్ కల్లేపల్లి రాంగోపాల్, డి.గణేష్, బిఎస్‌సి జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు పాల్గొన్నారు.

'గుండ' దంపతులను సన్మానిస్తున్న కార్యకర్తలు

వైసిపికి మేధావుల షాక్

గౌతు శిరీషకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీగా టిడిపి అభ్యర్థి చిరంజీవిరావు విజయం సాధించడం రానున్న ఎమ్మెల్యే ఎన్నికల విజయానికి దిక్సూచి కావాలని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు అన్నారు. అరసవల్లిలోని ఆయన నివాసం వద్ద గుండ దంపతులకు దుశ్శాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రమణ, వైకుంఠ, జ్యోతిప్రసాద్, వెంకటరామరాజు పాల్గొన్నారు.

పోలాకి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.చిరంజీవరావు గెలుపు వచ్చే సాధారణ ఎన్నికలకు సంకేతమని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మబుగాంలో ఉన్న తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. మేధావులు మౌనం వహిస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదమని చెప్పిన పెద్దల ఆలోచనని ఆచరణలో పెట్టారని అన్నారు. ఏడు పదుల వయసులో 17 ఏళ్ల కుర్రాడిలా చంద్రబాబునాయుడు ఆంధ్రా భవిష్యత్ కోసం నిరంతర పోరాటం చేస్తున్నారని అన్నారని అన్నారు. కార్యాకర్తలందరూ ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

పలాస: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసిపికి షాక్ ఇచ్చాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. శనివారం పలాస టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి పాలనలో మేధావులు మౌనంగా ఉండిపోయారని, ఇటీవల జరిగిన శాసన మండలి ఎన్నికల్లో వారు తమ ప్రతాపాన్ని చూపించడంతో తెలుగుదేశం పార్టీకి తిరిగి పూర్వ వైభవం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని అన్నారు.

వేపాడ చిరంజీవిని గెలుపునకు కృషి చేసిన పట్టభద్రులకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గౌతు శిరీషను పార్టీ శ్రేణులు లొడగల కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, మల్లా శ్రీనివాస్, టంకాల రవిశంకర్ గుప్తా, బడ్డ నాగరాజు, కొత్త సత్యం, శ్రీనివాసరావు, మోహన్, విఠల్, సురేష్‌లు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ చేసుకోవాలి

మెళియాపుట్టి: ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలని ఎంపిడిఒ పి.చంద్రకుమారి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఆధార్ అప్‌డేట్ కోసం ఈ నెల 20, 21, 27, 28, 29 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్‌డిజి సర్వే, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఎఎన్ఎంలు, అంగన్వాడీలతో సర్వేను వేగవంతం చేయాలని కోరారు. 0 నుండి 5ఏళ్లు,6 నుండి 19 ఏళ్ల పిల్లలు, గర్భిణులు ఇకెవైసి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎఒ తిరుపతి పట్నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రకుమారి

చిన్న వర్షానికే...

ప్రధాన రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

ఆమదాలవలస: ద్రోణి ప్రభావంతో శనివారం సాయంత్రం పట్టణంలో కురిసిన చిన్నపాటి వర్షానికి ప్రధాన రహదారి నీట మునిగింది. దీంతో ప్రయాణికులు, ప్రజలు అవస్థలకు గురయ్యారు. వన్ వే సెంటర్ దగ్గర్లో ఉన్న బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ రోడ్డు వద్ద నీరు నిలిచిపోవడంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు, ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం వెరసి ఈ పరిస్థితికి కారణమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వన్ వే సెంటర్ కూడలి వద్ద ఇప్పటికి రెండుసార్లు అక్కడ ఉన్న దుకాణదారులు కాలువపై పలకలను కప్పేశారు. మున్సిపల్ అధికారులు వాటిని తొలగించడం, మరలా దుకాణదారులు తిరిగి పెట్టడం సర్వసాధారణమైపోయింది. దీంతో వర్షపు నీరు పోయే దారి లేక రోడ్డుపైనే నీరు నిలిచిపోవడంతో ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే పట్టణంలోని కూరగాయల మార్కెట్ సెంటర్, రైతు బజార్ చిన్నపాటి వర్షానికి నీరు నిలిచిపోవడంతో ప్రజలు నాయకులు అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు నిర్లక్ష్య ద్వారానే విడనాడి సమస్యను పరిష్కరించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

జి.సిగడాం : జి.సిగడాం సచివాలయంలో మహారాజా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్స్ అధ్యక్షతన సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ గౌరీశ్వరరావు ఆధ్వర్యాన శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజిషియన్, గైనకాలజిస్టు, ఆర్థో, ఇఎన్‌టి తదితర రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు దినేష్, జి.తేజస్విని, గౌరీసింధు, రాజా వెంకటాద్రి, పి.యోగితావర్మ, టి.కావ్య, బి.సాగరికలు 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం రోగులకు పలు సూచనలు చేశారు. బిపి, సుగర్ వంటి వ్యాధిగ్రస్తులు నిరంతరం వైద్య మందులను వేసుకుని నెలకొసారి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, ఆశా కార్యకర్త రాజు పాల్గొన్నారు.

జి.సిగడాం : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

సరుబుజ్జిలి : ప్రజలందరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ అన్నారు. సరుబుజ్జిలిలో రేపటి ప్రయోజనం సంస్థ ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ వైద్య కళాశాల ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ వైద్య శిబిరంలో బిపి, సుగర్, గుండె, కంటి, స్త్రీల సమస్యలపై వైద్యాధికారులు గీతా శివాని, బ్లేస్సి అణుఖ్య, రాజేష్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్వర్, ఏరియా మేనేజర్ శ్రీధర్, సంతోష్, పిఆర్ఒ కుమార్, రేపటి ప్రయోజనం ఫౌండేషన్ చైర్మన్ బాన్న భార్గవ్ (బాలు) వైస్ చైర్మన్ జనార్ధనరావు, కోశాధికారి వెంకటరమణ, కిరణ్‌కుమార్, సీతంనాయుడు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

జ్ఞాపికను స్వీకరిస్తున్న ప్రతాప్

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర అదనపు డిజి మాదిరెడ్డి ప్రతాప్ అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని శనివారం సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికారు. స్వామివారి సేవల అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో ఆయనకు శేషవస్త్రాన్ని కప్పి ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ జ్ఞాపికను అందజేశారు. ఆయనతో పాటు వన్‌టౌన్ ఎస్ఐ గణేష్, ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

వైభవంగా కళ్యాణం

ఫాల్గుణ మాసం బహుళ ఏకాదశి పర్వదినాని పురస్కరించుకుని అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ సంప్రదాయ బద్ధంగా అర్చకులు ఈ వేడుకలను నిర్వహించారు.

25న మున్సిపల్ సమావేశం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం ఈ నెల 25 శనివారం ఉదయం 11గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తెలిపారు. ఎన్నికల నియమావళి ఈ నెల 21వ తేదీతో ముగియడంతో వాయిదా పడిన బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి వైస్ చైర్మన్లు, వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

అట్టలను పంపిణీ చేసిన రాజశేఖర్‌రెడ్డి

పరీక్షల కిట్లు పంపిణీ

మెళియాపుట్టి : మండల కేంద్రానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వైసిపి నాయకులు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపనా రాజశేఖర్‌రెడ్డి పరీక్ష కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ మేరకు 40 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కో ప్లాంకు, ఐదు పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యు.గణపతిరావు, నల్లయ్యరెడ్డి, శంకర్‌రెడ్డి, నూకరాజు, మాడుగుల ప్రసాద్, వెంకటరమణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలువురి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : మండలంలోని కేశుపురానికి ప్రశాంత్‌శెట్టి కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధికి కావాల్సిన మందులు కొనుగోలు చేసుకోలేని దుస్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న కేశుపురానికి చెందిన శ్రీకాళీమాత సేవా సమితి సభ్యులు శనివారం పరామర్శించారు. అనంతరం రూ.12 వేలు నగదు, నెల రోజులకు సరిపోయే నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : యువత క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని వైద్యులు ధానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని సింహద్వారం సమీపంలో ఉన్న మెడికవర్ ఆస్పత్రిలో పెద్దరెల్లి వీధికి చెందిన నూకాంబిక అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులకు శనివారం రూ.20వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి- కవిటి

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి ఎంతో మేలని కొబ్బరి రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్ అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవంలో భాగంగా వెలుగు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో శనివారం కవిటి కొత్తూరు గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చిరుధాన్యాలు పండించేందుకు రైతులను సమాయత్తం చేస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా జిల్లాకు అనుకూలమైన రాగులు పెద్దఎత్తున పండించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాగులకు ప్రభుత్వం రూ.3,500ల మద్దతు ధర ప్రకటించినట్టు ఆయన తెలిపారు. రైతులకు ఇది శుభపరిణామమని అన్నారు. ఈ

ర్యాలీ నిర్వహిస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు

అవకాశాన్ని ఉపయోగించుకుని రైతులు చిరు ధాన్యాలు పండించేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యవర్గ సభ్యులు బొర్ర కీర్తిరావు, బి.రంగారావు, పి.కూర్మారావు, ఎల్.ప్రసాదరావు, దయానిధి, రైతు ఉత్పత్తిదారుల సంస్థ సిబ్బంది భాగ్యలక్ష్మి, గీత, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక మోసాలపై అప్రమత్తత అవసరం

అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

ఆమదాలవలస : ఆర్థిక మోసాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కోఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని కట్యాచార్యులపేటలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో శనివారం ఆర్థిక అక్షరాస్యతపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా ఫోన్లు చేసి మీ బ్యాంకు అకౌంట్ వివరాలను అడిగితే సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం రూ.20తో రూ.2 లక్షలు ప్రమాద బీమా లభిస్తుందని అన్నారు. 18 నుంచి 70 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులని అన్నారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, ఫీల్డ్ అసిస్టెంట్ పి.రాజేశ్వరి, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి- నందిగాం

చైల్డ్‌లైన్ పలాస సబ్ సెంటర్ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల పిల్లలకు బ్యాడ్ టచ్.., గుడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ముందుగా చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ శివాజీ మాట్లడుతూ బాలల హక్కుల గురుంచి, లైంగిక వేధింపులకు గురవ్వకుండా వారు తీసుకోవాల్సిన జాగ్రతలు, బాల కార్మికులు, చైల్డ్ బెగ్గింగ్‌ను ఎలా నివారించాలో వివరించారు. చైల్డ్‌లైన్ పలాస ప్రాజెక్ట్ టీం మెంబెర్స్, సచివాలయ ఉద్యోగినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఎఎస్ఐ మురళీకృష్ణ మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, అనర్థాలను నివారించి, బాల్య వివాహాలను రూపుమాపటాన్ని వివరించారు. పాఠశాల హెచ్‌ఎం విద్య, వైద్యం వంటి చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ రక్షణ

అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ మురళీకృష్ణ

గురుంచి వివరించారు. 1098 టోల్‌ఫ్రీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ టీం మెంబెర్స్ రమణ, జగదీశ్వరి, కె.సునీత, మురళీకృష్ణ, హరిబాబు, ఉపాధ్యాయులు కరుణకుమారి, పరిమళ, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలతో అవస్థలు

పేరుకుపోయిన చెత్తా చెదారం

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలో ఏ వీధి చూసినా దుర్గంధం వెదజల్లుతుంది. ఎటు చూసినా చెత్త కుప్పలే దర్శనమి స్తున్నాయి. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం స్వచ్ఛ భారత్‌గా చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తునే ఉన్నారు. కానీ, ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు మచ్చుకైనా కనిపించడం లేదు. బూర్జ టిటిడి కళ్యాణ మండపానికి వెళ్లే దారిలో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో దుర్గంధం వేద చల్లుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెత్త కుప్పల్లో దోమలు విజృంభిస్తుండడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని మండలశాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు డెప్యుటేషన్లపై పనిచేస్తుండడంతో ఎవరు ఎప్పుడు కార్యాలయాలకు వస్తారోనని తెలియని పరిస్థితి స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రేపటి నుంచి ఆధార్ అప్‌డేట్

కోటబొమ్మాళి : ఈ నెల 20 నుంచి సచివాలయాల్లో ఆధార్ కార్డుల అప్‌డేట్స్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 20న చీపుర్లపాడు, చిన్నసాన, హరిశ్చంద్రపురం, మాసాహెబ్‌పేట, కోటబొమ్మాళి-2, 21న చీపుర్లపాడు, చిన్నసాన, హరిశ్చంద్రపురం, మాసాహెబ్‌పేట, కోటబొమ్మాళి -2, 27న తర్లిపేట, చిన్నసాన, హరిశ్చంద్రపురం, జర్జంగి-1, కోటబొమ్మాళి-1 సచివాలయాల్లో అప్‌డేట్స్ చేసుకోవాలన్నారు. 2016 జూన్ నెలకు ముందు ఆధార్ కార్డుల్లో వివరాలు మార్చాల్సిన వారందరూ ధ్రువపత్రాలతో ఆధార్ ఆప్‌డేట్స్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. రోజూ 60 డాక్యుమెంట్లు అప్‌డేట్స్ అయ్యే విధంగా వాలంటీర్లకు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వాలని ఆదేశించారు. గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు.

21న నారాయణవలస సంత వేలం పాట

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస గురువారం సంత వేలం పాట ఈ నెల 21వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్ తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనాలనుకున్న వారు పూర్తి వివరాలకోసం మండల పరిషత్ సిబ్బందికి సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న యశోద

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

సోంపేట: మండలంలోని పలాసపురం గ్రామ పరిసరాల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను జెడ్‌పిటిసి తడక యశోద శనివారం పరిశీలించారు. సర్పంచ్ జోగారావుతో కలిసి ఇళ్లను పరిశీలించారు. అనంతరం జాతీయ రహదారి వద్ద పలాసపురం పరిధిలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఆమె వెంట ఇంజినీరు రవి ఉన్నారు.

'ఆసరా'పై అవగాహన

ఆమదాలవలస : వైఎస్ఆర్ ఆసరా పథకంపై గడపగడపకు వెళ్లి గ్రామ సంఘం ప్రతినిధులు బొట్టుపెట్టి మరి మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని అక్కులపేట, శ్రీనివాసాచార్యులపేట గ్రామాల్లో గ్రామ సంఘం ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి మహిళకు శనివారం బొట్టు పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 25న విడుదల చేయనున్న మూడో విడత నిధుల వివరాల గురించి ప్రతి సభ్యురాలికీ ఎంత లబ్ధి చేకూరింది అనేదానిపై అవగాహన కల్పించారని అన్నారు. గ్రామ సంఘాల ద్వారా స్త్రీనిధి బ్యాంకుకు దరఖాస్తు చేసుకుంటే అర్హులకు 48 గంటల్లోనే రుణాలు మంజూరు చేయిస్తామని తెలిపారు.

లేగదూడల ప్రదర్శన

ఆమదాలవలస : పురపాలక సంఘంలోని నాలుగో వార్డు గేదెలవానిపేటలో జిల్లా పశుగణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యాన శనివారం లేక దూడల ప్రదర్శన నిర్వహించారు. 20 మేలు జాతి దూడలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు మరో పదిమంది పశుపోషకులకు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా లేగ దూడలన్నింటికీ ఏలిక పాముల నివారణ, లివర్ టానిక్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక ఉపసంచాలకులు డిఎల్‌డిఎ డాక్టర్ ఎస్.మన్మథరావు, సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్.ఆనందరావు, అక్కులపేట పశువైద్యరాలు డాక్టర్ వై.హేమలత, డాక్టర్ శరత్‌చంద్ర, గ్రామస్తులు సాదు కామేశ్వరరావు, సుందరరావు పాల్గొన్నారు.

లేగ దూడలను ప్రదర్శిస్తున్న పాడి రైతులు